

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 26 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

అంతవరకూ మౌనంగా అంతా గమనిస్తున్న సమర్థరాముడి ముఖం గంభీరంగా మారింది. అంతవరకూ చూడని ఒక కొత్తరూపాన్ని ఆయనలో చూశాడు కృష్ణరాయలు. ఆయన కనులు అల్లంతదూరంనుండి నృత్యం చేస్తున్నట్లు లయబద్ధంగా అడుగులు వేస్తూ వస్తున్న సన్నని ఆకారాన్ని పరికించి చూస్తున్నాయి.

గాలిలో తేలుతున్నట్లుగా ఉన్నది ఆ నడక. అణువణువునా ఒక కళ తొణకిసలాడుతున్నది అతడి శరీరంలో. నడుస్తూనే భుజం మీదనున్న ఉత్తరీయాన్ని నడుముకు బిగించుకున్నాడు. పొడవాటి కేశాలను చివర ముడివేసుకునివున్నాడు. ఆజానుబాహుడు. బాగాకాల్చిన యినుమును మలిచినట్లు సన్నగానే అయినా దృఢంగా వున్నాడు.

పొడవాటి అంగలు వేస్తూ అతడు వస్తుంటే నల్లరాతి శిల్పం నడిచివస్తున్నట్లు వున్నది. ఇనపకడ్డీలలాగా వున్న పొడవాటి చేతులు, మేకులలాంటి దృఢమైన పొడవైన చేతివ్రేళ్ళు. ఏదో సాధన చేస్తున్నవాడిలా చేతివేళ్లను చిత్రంగా కదిలిస్తూ వస్తున్నాడు. అతనికి రెండుప్రక్కలా కొద్దిగా ఎడంగా,

అర్థచంద్రాకారంలో మూడు అడుగుల పొడవున్న విచ్చుకత్తులను దృఢంగా ఎత్తిపట్టుకుని అనుసరిస్తున్నా రు ఇరవైమంది. రెండుప్రక్కలా పదేసిమంది వున్నారు.

యిరవై అడుగుల దూరంలో ఆగిపోయాడు అతడు. నడుముమీద చేతులు వేసుకుని సమర్థరాముడి బృందాన్ని పరికించిచూశాడు. అప్పటికి సమర్థరాముడి చుట్టూ నిలబడి సిద్ధంగా వున్నారు ఆయన శిష్యబృందం. ఉత్తరభారతంనుండి వచ్చిన మహంతులు తొమ్మిదిమంది, దుల్లాభట్టీ కథాగానంచేసిన సిఖ్ఖులు ముగ్గురు, కళ్యాణ్ స్వామి, ఉద్ధవుడు, కృష్ణరాయల అంగరక్షకులు ఆరుగురు, వీరూ సరిగ్గా యిరవైమంది ఉన్నారు.

మహంతుల ముఖాలలో యింతవరకూ ఉన్న ప్రశాంతత స్థానంలో వీరరసం తొణికిసలాడుతున్నది. వారి చేతులలో నిలువెత్తు త్రిశూలాలు మిలమిల లాడుతున్నాయి. అంతవరకూ వాయిద్యాలను ధరించిన సర్దారుల చేతులలో నాలుగడుగుల పొడవాటి ఖాండా ఖడ్గాలున్నాయి. రాయల అంగరక్షకులు తమ కరవాలాలతో ముందుకు దూకడానికి సిద్ధంగా వున్నారు.

'మర్మకళ' అన్నాడు సమర్థరాముడు, తమనే పరిశీలనగా చూస్తున్న సన్ననివ్యక్తిని చూపిస్తూ. ఒక్కసారిగా సంభ్రమానికి లోనైనారు ఉద్ధవుడు, కళ్యాణ్ స్వామి. సాక్షాత్తూ పరమశివుడు కుమారస్వామికి బోధించిన యుద్ధవిద్య మర్మవిద్య! కుమారస్వామి కపట వృద్ధముని వేషంలో దాన్ని అగస్త్యమహర్షికి బోధించాడు. ఆత్మరక్షణకోసం, శత్రువులను అంతం చేయడంకోసం దానికి ఆయుర్వేద రహస్యాలను జోడించి అగస్త్యుడు తన శిష్య పరంపరద్వారా లోకానికి అందించాడు. మూడురకాల యుద్ధవిద్యలుగా మలిచి, 'మర్మవిద్య', 'కలరిప్పయట్టు', 'సిలంబం' అనే పేర్లతో ఆయుర్వేదము, సిద్ధవైద్యవిద్యనూ జోడించి, శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ చేయగల మహా యుద్ధ విద్యలుగా దక్షిణాపథాన వ్యాప్తి చేశాడు.

మానవ శరీరంలోని 108 మర్మస్థానాలను, సంధులను తెలుసుకుని, ఆ ఆయువుపట్లమీద దాడి చేసి శత్రువును చంపవచ్చు, కదలికలు లేని జీవచ్ఛవంగా చేయవచ్చు. ఆ మర్మస్థానాలనే సున్నితంగా ప్రేరేపించి సమస్త వ్యాధులను నయం చేయవచ్చు. దశాబ్దాలతరబడి తీవ్ర సాధన చేస్తేనే పట్టుబడడం కష్టమైన మహావిద్య మర్మవిద్య. అష్టాంగయోగ సాధనలో ఆరితేరినవారికే మర్మవిద్య సంపూర్ణంగా సిద్ధిస్తుంది. కుండలినీయోగ సాధనకూడా తోడైతే మృత్యుంజయుడే అవుతాడు. పంచమహాభూతాలూ అతడికి బంట్లు అవుతాయి. మర్మవిద్యను సాధించినవాడు ఉత్తిచేతులతో మదపుటేనుగులను కూడా వంచగలుగుతాడు. మహాగురువుద్వారా ఉపదేశం పొంది కఠినమైన పరీక్షలకు తట్టుకున్నవాడికే గురుత్వం సిద్ధిస్తుంది ఆ విద్యలో. కేవలం ఉత్తిచేతులు, చేతివేళ్ళతో సాగించే మహాయుద్ధవిద్య మర్మవిద్య. చేతులు, వేళ్ళు కూడా ఉపయోగించకుండా కేవలం కంటి చూపుతోనే మర్మసంధులపై దాడిచేసి, శత్రువును అంతం చేయగలవాడు మహాగురువు. దశాబ్దాలతరబడి నియమ నిష్ఠలతో అష్టాంగ యోగసాధనలో పరిపూర్ణుడైనవారికే మహాగురుత్వం సిద్ధిస్తుంది మర్మవిద్యలో.

ఆ సన్ననివ్యక్తి చిరునవ్వు చిందిస్తూ రెండుకాళ్ళూ ఎడంగా దృఢంగా చాచి గూడలు వంచి రెండుచేతులూ జోడించి నమస్కరించాడు, దాడి చేయబోతున్నట్లు అది సూచన. వారిస్తున్నట్లు కుడిచేతిని సాచి, అతడి కళ్ళలోకి చూస్తూ స్వచ్ఛమైన తమిళంలో ప్రశ్నించాడు సమర్థరాముడు 'పెరియాసన్! (మహా గురువా!) మనకు శత్రుత్వం లేదు, ఎందుకు అనవసరమైన హింస? పవిత్రమైనవిద్యను ఎందుకు వ్యర్థం చేస్తున్నావు? సమర్థరఘువీరుడు శాంతిని కోరుతున్నాడు!

అతడు సమాధానం యివ్వలేదు. సాధన చేస్తున్నట్లు చేతులు విశాలంగా సాచి కదిలిస్తూ నిశితంగా చూస్తున్నాడు. నెమ్మదిగా విచ్చుకుంటున్న పడగలలా అతడి దృఢమైన కండరాలు పొంగుతున్నాయి.రెండుచేతులనూ ముందుకు సాచి సంజ్ఞ చేశాడు సమర్థుడు. శిష్యులిద్దరికీ సిద్ధం కమ్మని అది సూచన.కళ్యాణ్ స్వామి, ఉద్ధవుడు మూడేసి అడుగులు ముందుకువేసి తామూ అదేమాదిరి సిద్ధం అయినారు. గూడలు వంచి శత్రువుకు అభివాదం చేశారు.

సన్ననివ్యక్తి కనులు విచిత్రంగా మెరిశాయి. వ్యంగ్యంగా నవ్వి ప్రత్యభివాదం చేశాడు. అంతలోనే కోపంగా 'మూర్ఖులారా! మహాగురువుతో తలబడడానికి మీరు అనర్హులు! మహావిద్యకు ద్రోహం చేస్తున్నారు' అన్నాడు. 'జయ జయ రఘువీరసమర్థా!' అన్న సమర్థరాముడి నినాదం బిగ్గరగా వినిపించింది. మహలు, తోట, ముక్తివరం ఆ నినాదంతో ప్రతిధ్వనించినట్లు అనిపించింది.

విచ్చుకత్తులు, ఖాడాలు, త్రిశూలాలు మెరిశాయి. గగురుపొడిచే సంకులసమరం మొదలైంది.సింహాలలా ముందుకు దూకారు కళ్యాణస్వామి, ఉద్ధవుడు. పరిసరాలలో గాలి స్తంభించేలా 'హుం' అని ముందుకు దూకాడు మర్మవిద్యలో మహాగురువైన ఆ సన్ననివ్యక్తి.

ఆతని తొడలను లక్ష్యంగా చేసుకుని ఉద్ధవుడు, చీలమండలను లక్ష్యంగా చేసుకుని కళ్యాణ్ స్వామి వేళ్ళతో దాడి చేస్తున్నారు. మెరుపులాగా దూకుతూ బాకులవంటి వారి వేళ్ళకు అందకుండా కాచుకుంటూ, వారి మెడలను, శిరస్సులను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నాడు ఆ సన్ననివ్యక్తి. అతడిని పడగొట్టి లొంగదీయడం వీరి లక్ష్యం, వీరి ప్రాణాలను తీయడం అతడి లక్ష్యం. తలనుండి మెడవరకు 25 మర్మసంధులు, వాటిపై బలంగా దాడిచేస్తే మరణమే! తొడలనుండి చీలమండలవరకు కాళ్ళలో 15 మర్మసంధులు, వాటిపై దాడి చేయడంద్వారా శత్రువును కదలికలు లేకుండా పడగొట్టవచ్చు. మర్మవిద్యతో పోరాడుతున్న వీరి చేతులు, వేళ్ళు గాలిని చీలుస్తూ తుమ్మెదలలా ధ్వనులు చేస్తున్నాయి.

అటు ఆయుధాలతో కలబడుతున్నవారి అరుపులు, కేకలు, ఆయుధాల మ్రోతలు మారుమ్రోగుతున్నాయి. ఘడియసేపటిలో శత్రువులు పదిమంది తలలు తెగిపడ్డారు. హరిద్వారం నుండి వచ్చిన మహంతు మాధవస్వామి కుడిచేయి భుజమునుండి మణికట్టువరకూ నిలువునా చీలింది. నెత్తుటి మడుగులో సొమ్మసిల్లి పడిపోయాడు అతడు. ముందుకు దూకబోయిన కృష్ణరాయలను వారించాడు సమర్థుడు. రామకృష్ణా! అని బిగ్గరగా నినదించాడు. మహలు ద్వారంవద్ద బాలుడికి రక్షణగా వున్న అయోధ్య మహంతు రామకృష్ణస్వామి ముందుకు దూకాడు. రాంబోలా బాలుడికి మరింత చేరువగా వచ్చి కాపలా కూర్చుంది.

అటువైపు మరొక ఘడియలో మిగిలిన పదిమంది శత్రువులు నేలకూలారు. ఐదుగురు మహంతులు తీవ్రంగా గాయపడ్డారు. నిరాయుధులైన యిద్దరు మహంతులను కాపాడే ప్రయత్నంలో కృష్ణరాయల అంగరక్షకులు యిద్దరు అసువులు బాశారు.

యిటు మర్మవిద్య కొనసాగుతూనే వున్నది. అంతకంతకూ శిష్యుల అలసట పెరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఆ మహావీరుడి చేతులకు అందకుండా కాచుకోవడమే సరిపోతున్నది యిప్పుడు. అతడిని ముందుకు రాకుండా అడ్డుకోవడమే జరుగుతున్నది కానీ పడగొట్టలేక అలసిపోతున్నారు. ఉన్నట్టుండి నడుముకుబిగించిన ఉత్తరీయాన్ని విప్పివేశాడు ఉద్ధవుడు.

ఆలోచన అర్థమైన కళ్యాణ్ స్వామి కూడా తన ఉత్తరీయాన్ని అందుకున్నాడు. వారి ఆలోచన అతడికి అర్థం అవుతుండగానే రెండు ఉత్తరీయాలు అతడి రెండుచేతులకు చుట్టుకున్నాయి. చేతులు కట్టినట్లు ఐపోయాయి. శక్తిని కూడదీసుకుని పక్షిలా గాలిలోకి ఎగిరిన అతడిని నేలకు విసిరికొట్టారు. మరుక్షణం అతడి రెండుచేతులమీద ఉద్ధవుడు, రెండు పాదాలమీద కళ్యాణ్ స్వామి కనిపించారు. కాళ్ళూ చేతులు వారి పాదాలకింద నలిగిపోతూ అతడు పెనుగులాడుతుండగా కిల కిలమని ఒక నవ్వు వినిపించింది.

పోరాటం మొదలైనదగ్గరినుండీ భయంతో ముణగదీసుకుని చూస్తున్న బాలుడు భవానీప్రసాదరాయలకు ఆ సన్నివేశం బాగా నచ్చినట్లుంది. అప్రయత్నంగా చప్పట్లుకొడుతూ నవ్వుతూ గంతులేశాడు. అటు తలతిప్పిన సన్ననివ్యక్తి బాలుడిని చూశాడు. ఆ నవ్వు అతడి అహాన్నిదెబ్బతీసింది. ఏమూలనో ఉన్న మానవత్వం పూర్తిగా చచ్చిపోయింది. కాళ్ళూ చేతులను బలంగా నేలకు అదిమి మంత్రగాడిలా గాలిలోకి లేచాడు ఆ బలశాలి. ఉద్ధవుడూ, కళ్యాణ్ స్వామి గాలిపటాల్లా ప్రక్కలకు పడిపోయారు. అంతదూరాన్నీ నాలుగు గంతులలో తేలుతున్నట్లుగా అధిగమించాడు ఆ సన్ననివ్యక్తి. చేతులకు చుట్టుకున్న ఉత్తరీయాలను రెప్పపాటులో వదిలించుకుని బాలుడిమీదకు దూకాడు. భయంతో కెవ్వున అరిచి స్పృహకోల్పోయాడు భవానీప్రసాదరాయలు.

అతడు తమవైపు దూకుతుండగానే రాంబోలా గాలిలోకి ఎగిరి అతడిమీదకు లంఘించింది. ఇనపముండ్లవంటి అతడి వేళ్ళు చురుగ్గా కదిలాయి. ఆ చేతులకు అందకుండా పక్కకు దూకింది రాంబోలా. బలమైన మోకులాంటి తోకను విసిరింది. పొడవాటి ఆ తోక అతడి మెడకు మూడు చుట్లు చుట్టుకోడం, ఒక్క ఉదుటున పైకి ఎగిరిన రాంబోలా ముప్పై అడుగుల పైనున్న దూలాన్ని బలంగా పట్టుకోవడం రెప్పపాటులో జరిగిపోయాయి. పచ్చిమాను విరిగినట్లు శబ్దం చేస్తూ అతడి మెడ విరిగిపోయింది. కళ్ళూ, నాలుకా బయటకు వికృతంగా వెళ్ళుకొచ్చాయి. గాలిలో వూగుతూ వుండిపోయింది అతడి మృతకళేబరం.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS